


ఎన్నికల ప్రచారంలో బాలలను వినియోగించరాదు

ఏలూరు : రానున్న సాధారణ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల సమావేశాలు, ప్రచారం, ర్యాలీలు తదితర ఏరూపంలోనూ బాలలను ఎట్టి పరిస్థితుల్లో వినియోగించరాదని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఆదేశాలు జారీ చేశారని డిఆర్‌ఒ డి.పుష్పమణి చెప్పారు. బుధవారం స్థానిక కలెక్టరేట్‌లోని డిఆర్‌ఒ ఛాంబర్‌లో ఓటర్ల జాబితా ప్రచురణపై, పోలింగ్ స్టేషన్లలో మౌలిక సదుపాయాలు, పోలింగ్ శాతం పెంపు వంటి అంశాలపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆమె సమావేశం నిర్వహించారు. సమావేశంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు దేవరపల్లి రత్నబాబు (బిఎస్‌పి), నెరుసు నెలరాజు (బిజెపి), పి.ఆదిశేషు (సిపిఎం), ఎస్‌పి.ప్రసాద్ (కాంగ్రెస్), ఎస్.అమ్మాజీబాబు (టిడిపి), కలెక్టరేట్ పరిపాలనాధికారి కె.కాశీవిశ్వేశ్వరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డిఆర్‌ఒ పుష్పమణి మాట్లాడుతూ ఫారం-7 కింద అందిన దరఖాస్తులను జిల్లాస్థాయి కమిటీ వాటిని క్షుణ్ణంగా పరిశీలించిందన్నారు. ఇప్పటి వరకు జిల్లా ప్రధాన ఎన్నికల అధికారి, కలెక్టర్ వారి అనుమతితో ఫారం-7 కింద 1,595 తొలగింపునకు, రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి 6,066 ఓట్ల తొలగింపునకు అనుమతించారన్నారు.

ప్రజల కోసం అడుగులు.. అర్థం చేసుకోండి





- టిక్కెట్లు దక్కనివారికి న్యాయం చేస్తాం
- విధ్వంసకర పాలనను అడ్డుకుందాం
- తాడేపల్లిగూడెం 'జెండా' సభలో చంద్రబాబు, పవన్‌కళ్యాణ్
- పెద్దసంఖ్యలో తరలొచ్చిన జనం

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి, తాడేపల్లిగూడెం, తణుకు రూరల్

'పొత్తులో భాగంగా కోరుకున్న వారికి టిక్కెట్లు ఇవ్వలేకపోవచ్చు. పని చేసిన ప్రతి కార్యకర్త, నాయకుడికి న్యాయం చేసే బాధ్యతను తీసుకుంటాం' అని టిడిపి, జనసేన అధినేతలు చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ తెలిపారు. ఇటీవల పొత్తు నేపథ్యంలో జిల్లాలో నెలకొన్న సమస్యలను దృష్టిలో పెట్టుకుని వారు ఈ వ్యాఖ్యలు చేసినట్లు తెలుస్తోంది. టిడిపి, జనసేన ఉమ్మడి ఎన్నికల సభ 'జెండా' బుధవారం తాడేపల్లిగూడెం బైపాస్‌లో జరిగింది. సభకు ఉభయ గోదావరి జిల్లాల నుంచి పెద్దఎత్తున టిడిపి, జనసేన నాయకులు, కార్యకర్తలు, జనం తరలివచ్చారు. సభకు దాదాపు లక్ష మంది వరకు వచ్చారని అంచనా. స్టేజీపై దాదాపు 500 మంది అతిథులు కూర్చునేలా ఏర్పాట్లు చేయడంతో పాటు జనం కోసం పెద్దఎత్తున గ్యాలరీలు ఏర్పాటు చేశారు. సాయంత్రం నాలుగు గంటలకు సభ ప్రారంభం కానుందని ఆరు గంటల వరకు కొనసాగుతుందని ముందుగా ప్రకటించారు. అయితే చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ సభా ప్రాంగణానికి చేరుకునేసరికి 5.45 గంటలైంది. దీంతో సభ 8 గంటల వరకు కొనసాగింది. సభ ప్రారంభం ఆలస్యం కావడంతో జనం తిరుగుముఖం పట్టిన పరిస్థితి కన్పించింది. చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ స్టేజ్‌పైకి వచ్చి ఇద్దరు చేతులెత్తి అభివాదం చేస్తూ పవన్‌కళ్యాణ్ టిడిపి జెండా, చంద్రబాబు జనసేన జెండా ఊపుతూ ఉత్సాహం నింపారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ టిక్కెట్లు రాని నేతలు ఎవరూ హెచ్చుకు పోవొద్దని, ఎవరూ ఎక్కువ కాదు, తక్కువ కాదని అన్నారు. రాష్ట్ర భవిష్యత్తు కోసం తాను, పవన్ శ్రీకారం చుట్టామన్నారు. టిడిపి, జనసేన దెబ్బకు వైసిపి ముక్కచెక్కలవ్వాలన్నారు. అంతా కలిసి కష్టపడి పనిచేసి నష్టం జరగకుండా చూడాలన్నారు. టిడిపి, జనసేన విన్నింగ్ టీమ్ అని, వైసిపి చీటింగ్ టీమ్ అని అన్నారు. విధ్వంసమైన రాష్ట్రాన్ని హత్యకు గురైన ప్రజాస్వామ్యాన్ని బతికించడానికి కలిశామన్నారు. ఎపిలో అన్ని వనరులూ ఉన్నప్పటికీ జగన్ సర్వనాశనం చేశాడన్నారు. రాష్ట్రంలో సైకో పాలన అంతం చేయాలన్నారు.



పవన్‌కళ్యాణ్ మాట్లాడుతూ టిడిపి, జనసేన అభివృద్ధికి, విజయానికి స్ఫూర్తి అన్నారు. బూత్‌లో వైసిపి వాళ్ళు తేడా చేస్తే జెండాతో బుద్ధి చెప్పాలన్నారు. రాష్ట్రంలో ఐదేళ్లలో యువతను, రైతులను, మహిళలను, అంగన్‌వాడీలను సైతం జగన్ మోసం చేశాడన్నారు. ఎపి రోడ్లపై పాలు పోస్తే చక్కగా ఎత్తుకోవచ్చంటూ ఎద్దేవా చేశారు. 2014 ఎన్నికల్లో జగన్ వస్తే స్కాం ఆంధ్రగా మారుతుందని ప్రధాని మోడీ అన్నారన్నారు. 2019 నుంచి రాష్ట్రం దోపిడీకి గురైందన్నారు. జనసేనకు ఆర్థిక వనరులులేవని, క్షేత్రస్థాయిలో బూత్ స్థాయి కార్యకర్తలు రాష్ట్రమంతటా లేరని, ఇటుక ఇటుక పేర్చి ఇల్లు కడుతున్నామన్నారు. జగన్ తప్పు చేసినా వాళ్ల మద్దతుదారులు వెనకేస్తున్నారని, నా సమూహం మాత్రం నన్ను ప్రశ్నిస్తుందని అన్నారు. వచ్చే ఎన్నికల్లో ప్రజలంతా మాతో కలిసి నడవాలని, రాష్ట్ర భవిష్యత్తును మార్చాలని కోరారు. టిడిపి రాష్ట్ర అధ్యక్షులు అచ్చెన్నాయుడు, సినీ నటుడు బాలకృష్ణ, కొత్తపల్లి సుబ్బారాయుడు, కొణతాల రామకృష్ణ తదితరులు మాట్లాడారు. పెద్దఎత్తున యువత తోసుకుంటూ బారికేడ్లు పడగొట్టి అంతా స్టేజీ ముందుకు రావడంతో కొంతసేపు గందరగోళం నెలకొంది. సభా కార్యక్రమాలు పర్యవేక్షిస్తున్న టిడిపి నాయకుడు పాలి ప్రసాద్ కాలుజారి పడిపోవడంతో ప్రయివేట్ ఆసుపత్రికి తీసుకెళ్లి చికిత్స అందించారు. కాలు విరిగినట్లు డాక్టర్లు నిర్ధారించినట్లు తెలిసింది. పెద్దఎత్తున జనం రావడంతో కొద్దిసేపు ట్రాఫిక్ స్తంభించింది.

నరసాపురం నుంచి నేనే పోటీ చేస్తా : ఎంపీ రఘురామకృష్ణంరాజు

ఇటీవల వైసిపికి రాజీనామా చేసిన ఎంపీ కనుమూరి రఘురామకృష్ణంరాజు టిడిపి, జనసేన ఉమ్మడి సభకు విచ్చేశారు. రఘురామకృష్ణంరాజు మాట్లాడుతూ నరసాపురం నుంచి మళ్లీ నేనే పోటీ చేస్తానని తెలిపారు. నాకు టిక్కెట్ రాదని కొన్ని పత్రికలు రాస్తున్నాయని, అయితే నేనే కూటమి నుంచి పోటీ చేస్తానని చెప్పారు. త్వరలోనే మీ దగ్గరకొచ్చేస్తానంటూ కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడారు.



హెలిప్యాడ్ వద్ద జగన్‌కు స్వాగతం పలికిన నేతలు, అధికారులు

నాగబాబు కుమారుని వివాహానికి సిఎం

వధూవరులకు శుభాకాంక్షలు తెలిపిన జగన్

ప్రజాశక్తి - భీమవరం, భీమవరం రూరల్, కాళ్ల

ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి బుధవారం భీమవరంలో పర్యటించారు. వైసిపి పాలకొల్లు నియోజకవర్గ ముఖ్యనేత గుడ్డం నరసింహ నాగేంద్రరావు (నాగబాబు), రాజరాజేశ్వరి దంపతుల కుమారుడు సుభాష్, భీమవరానికి చెందిన ఇందుకూరి గోపాలకృష్ణ, రాజ్యలక్ష్మి దంపతుల కుమార్తె విజయ దీప్తి వివాహానికి జగన్ హాజరయ్యారు. వధూవరులు సుభాష్, విజయదీప్తిలను ముఖ్యమంత్రి జగన్ ఆశీర్వదించి పుష్పగుచ్ఛం అందజేసి వివాహ శుభాకాంక్షలు తెలిపారు. తొలుత తాడేపల్లి క్యాంప్ కార్యాలయం నుంచి హెలికాప్టర్లో భీమవరం బయలుదేరిన ముఖ్యమంత్రి జగన్ కాళ్ల మండలం పెదఅమిరం గ్రామంలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌కు 3.42 గంటలకు చేరుకున్నారు. హెలిప్యాడ్ వద్ద ముఖ్యమంత్రి జగన్‌కు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ, శాసనమండలి ఛైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు, రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు, ప్రభుత్వ ఛీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు, రాష్ట్ర ప్రభుత్వ విప్ గ్రంధి శ్రీనివాస్, ఏలూరు రేంజ్ డిఐజి జివిజి.అశోక్‌కుమార్, కలెక్టర్ సుమిత్‌కుమార్‌గాంధీ, జిల్లా ఎస్పి అజిత వేజెండ్ల, జాయింట్ కలెక్టర్ ఎస్.రామ్‌సుందర్‌రెడ్డి, ఎంఎల్‌సి కవురు శ్రీనివాస్, ఆచంట ఎంఎల్ఎ చెరుకువాడ శ్రీరంగనాథరాజు, డిసిసిబి ఛైర్మన్ పివిఎల్.నరసింహరాజు జగన్‌కు పుష్పగుచ్ఛాలు అందజేసి ఘన స్వాగతం పలికారు. అక్కడ నుంచి రోడ్డు మార్గాన రాధాకృష్ణ కన్వెన్షన్‌లో ఏర్పాటు చేసిన వివాహ కార్యక్రమానికి సిఎం హాజరయ్యారు. వధూవరులకు శుభాకాంక్షలు తెలిపాక ఇరువురి కుటుంబ సభ్యులతో కొద్దిసేపు ముచ్చటించారు. అనంతరం 4.12 గంటలకు అక్కడ నుంచి రోడ్డు మార్గంలో బయల్దేరి పెదఅమిరంలోని హెలిప్యాడ్ వద్దకు చేరుకుని 4.30 గంటలకు హెలికాప్టర్లో వెనుదిరిగారు. సిఎం జగన్ భీమవరం పర్యటన కేవలం 48 నిమిషాల్లో ముగిసింది. కార్యక్రమంలో ఎంఎల్ఎలు పుప్పాల శ్రీనివాసరావు, తలారి వెంకట్రావు, డిసిసిబి ఛైర్మన్ పివిఎల్.నరసింహరాజు, నరసాపురం ఎంపీ అభ్యర్థి గూడూరి ఉమాబాల, పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌చార్జి గుడాల గోపి, ఎంబిసి ఛైర్మన్ పెండ్ర వీరన్న, క్షత్రియ కార్పొరేషన్ ఛైర్మన్ పాతపాటి శ్రీనివాసరాజు, ఎస్సి కమిషన్ సభ్యుడు చెల్లెం ఆనందప్రకాష్, ఆటవీ శాఖ డైరెక్టర్ మంతెన యోగీంద్రబాబు, అల్లూరి సేవాసమితి ప్రెసిడెంట్ గాదిరాజు సుబ్బరాజు, మాజీ ఎంపిపి అల్లు వెంకట సత్యనారాయణ, ఆకివీడు జెడ్‌పిటిసి వేగేశ్న వెంకటరాజు, బిసి కార్పొరేషన్ డైరెక్టర్ రఘురాం, గూడూరి శ్రీనివాస్, చీర్ల రాధాకృష్ణయ్య, యడ్ల తాతాజీ తదితరులు పాల్గొన్నారు.

రైతుభరోసా సొమ్ము రూ.41.30 కోట్లు జమ

సున్నా వడ్డీ రాయితీగా రూ.8.16 కోట్లు - కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

ఏలూరు : జిల్లాలో ఇప్పటి వరకూ పెట్టుబడి సాయం కింద 2,08,073 మంది రైతులకు రూ.1234 కోట్లు అందించినట్లు జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ తెలిపారు. బుధవారం వైఎస్ఆర్ రైతుభరోసా-పిఎం కిసాన్ కింద, వైఎస్ఆర్ సున్నా వడ్డీ పంట రుణాలు కింద తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయం నుండి ముఖ్యమంత్రి జగన్ రైతులకు ఆర్థిక సాయం జమ చేశారు. జిల్లాస్థాయిలో స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి కలెక్టర్ ప్రసన్న వెంకటేష్, జిల్లా వ్యవసాయ సలహామండలి అధ్యక్షులు వెజ్జు వెంకటేశ్వరరావు, వ్యవసాయశాఖ జిల్లా అధికారి షేక్ హబీబ్ భాషా, పలువురు రైతులు, అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రైతుభరోసా-పిఎం కిసాన్ పథకం కింద జిల్లాలోని 2,04,642 మంది రైతులకు రూ.41.30 కోట్లు, 2023-24 ఏడాది సున్నా వడ్డీ రాయితీగా 36,965 మంది రైతుల ఖాతాలకు రూ.8.16 కోట్లు మెగా చెక్కులను రైతులకు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్, జిల్లా వ్యవసాయ సలహామండలి ఛైర్మన్ వెజ్జు వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రైతు సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం రైతుకు విత్తనం నుంచి విక్రయం వరకు ఆర్థికంగా భరోసా అందిస్తుందన్నారు.

విద్యార్థినులపై ఉపాధ్యాయుడి అసభ్య ప్రవర్తన

జంగారెడ్డిగూడెం హైస్కూలులో ఘటన
చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రుల ఆందోళన
ఎంఇఒకు ఎస్ఎఫ్ఐ నాయకుల వినతి

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం టౌన్

తమ పిల్లల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్న ఉపాధ్యాయుడిపై చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాలలో ఆందోళన చేశారు. జంగారెడ్డిగూడెం హైస్కూలులో పదో తరగతి విద్యార్థుల వద్ద యూనీఫాం తయారీ కోసం కొలతలు తీసుకునే సమయంలో స్కాట్స్ (భౌతిక శాస్త్రం) ఉపాధ్యాయుడు శ్రీహరి అసభ్యంగా ప్రవర్తించాడని, అతని వెంటనే చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు డిమాండ్ చేశారు. ఇదే హైస్కూలులో నెల రోజుల క్రితం బాలికపై అనుచితంగా ప్రవర్తించడంతో అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోలేదన్నారు. విద్యార్థుల పట్ల అసభ్యంగా ప్రవర్తించిన ఉపాధ్యాయుడు శ్రీహరి అందుబాటులో లేడని, అతనిపై అధికారులు చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు ఆందోళన చేశారు. విషయం తెలుసుకున్న ఎంఇఒ బి.రాముడు పాఠశాల వద్దకు చేరుకుని విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడారు. ఉపాధ్యాయుడిపై చర్యలు తీసుకునేవిధంగా చూస్తామని, జిల్లా విద్యాశాఖాధికారి దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు.

ఎస్ఎఫ్ఐ నాయకుల వినతి

ఈ ఘటనపై స్పందించిన ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కె.లెనిన్ మాట్లాడుతూ జంగారెడ్డిగూడెం జిల్లా పరిషత్ హైస్కూలులో విద్యార్థినులపై ఇలాంటి ఘటనలు గతంలో మూడుసార్లు జరిగాయని, వారిని కూడా సస్పెండ్ చేసి చేతులు దులుపుకున్నారే తప్ప ఎటువంటి చర్యలు తీసుకోలేదన్నారు. ఇప్పుడు తెలిపారన్నారు. ప్రధానోపాధ్యాయురాలికి పలుమార్లు చెప్పినా ఆమె పట్టించుకోలేదని, పైగా ఎవరికీ చెప్పొద్దని విద్యార్థినులను బెదిరించారని చెప్పారు. పాఠాలు చెప్పే గురువులు ఇలా చేయడం తగదని, హెచ్‌ఎంపై, ఉపాధ్యాయుడు శ్రీహరిపై చర్యలు తీసుకోకుండా చోద్యం చూస్తున్న ఎంఇఒను కూడా సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. మళ్లీ ఇలాంటి పునరావృతం కాకుండా జిల్లా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని, విద్యార్థినులతో అసభ్యకరంగా ప్రవర్తిస్తున్న శ్రీహరిని సస్పెండ్ చేయాలని, వారిపై పోక్సో కేసు పెట్టాలని ఎంఇఒకు వినతిపత్రం అందించారు.



తల్లిదండ్రులతో మాట్లాడుతున్న ఎంఇఒ రాముడు

ఉపాధ్యాయుడు సస్పెన్షన్

జంగారెడ్డిగూడెం హైస్కూలులో విద్యార్థినుల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన భౌతిక శాస్త్ర ఉపాధ్యాయుడు శ్రీహరిని సస్పెండ్ చేశారు. ఈ మేరకు జిల్లా విద్యా శాఖాధికారి ఎస్.అబ్రహం ఆదేశాలు జారీ చేశారు.

రెండోరోజు ప్రశాంతంగా టెట్ పరీక్షలు

ఏలూరు సిటీ : జిల్లా కేంద్రమైన ఏలూరులో టెట్ పరీక్షలు బుధవారం రెండోరోజు కొన సాగాయి. సిఆర్‌రెడ్డి ఇంజినీరింగ్ కళాశాల, సిద్ధార్థ క్వెస్ట్ కాలేజ్, ఏలూరు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీలో నిర్వహించిన పరీక్షల్లో ఉదయం పరీక్షకు 366 మంది హాజరు కావాల్సి ఉండగా 340 మంది హాజరయ్యారు. 26 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం పరీక్షకు 367 మందికిగాను 339 మంది హాజరయ్యారు. 28 మంది గైర్హాజరయ్యారు. పరీక్షల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలూ చోటుచేసుకోలేదని డిఇఒ అబ్రహం తెలిపారు.

ఇ-చలానాలు రద్దు చేయాలి

సిగ్నలింగ్ వ్యవస్థను మార్చాలని ఎఎస్‌పికి వినతి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

సీసీ కెమెరాల ద్వారా ఇ-చలానాలను విధించడాన్ని నిలిపి వేయాలని, ఆటో, క్యాబ్ వాహనాలపై విధించిన ఇ-చలానాలను రద్దు చేయాలని ఆలిండియా రోడ్ ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ ఫెడరేషన్ (సిఐటియు) కోరింది. ఈ మేరకు బుధవారం ఏలూరులోని జిల్లా ఎస్‌పి కార్యాలయంలో ఎఎస్‌పి జి.స్వరూపరాణికి ఫెడరేషన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బి.సూరిబాబు, జె.గోపి, నేత చక్రాల అమర్‌కుమార్ కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సూరిబాబు, గోపి మాట్లాడుతూ ఫైర్‌స్టేషన్ సెంటర్ సిగ్నల్స్ వద్ద గ్రీన్‌లైట్ వెలిగి ఉండగానే చలానా విధిస్తున్నారని తెలిపారు. స్టాప్‌లైన్, జీబ్రాలైన్, సీసీ కెమెరాలు అత్యంత లోపభూయిష్టంగా, సాంకేతిక లోపాలతో, అస్తవ్యస్తంగా ఏర్పాటు చేయడం వల్ల డ్రైవర్లు ఇ-చలానాలకు బలైపోతున్నారని తెలిపారు. ఈ సమస్యలపై సంబంధిత అధికారుల ద్వారా విచారణ జరిపిస్తామని ఎఎస్‌పి హామీ ఇచ్చారని వారు చెప్పారు. అనంతరం మీడియాతో జె.గోపి మాట్లాడుతూ ఏలూరు నగరంలో పాత బస్టాండ్, ఫైర్‌స్టేషన్లలో సిగ్నలింగ్ వ్యవస్థలో స్టాప్‌లైన్, జీబ్రాలైన్ మధ్య దాదాపు 15 మీటర్ల దూరం ఉందని, వీటిని వెంటనే క్రమబద్ధీకరించాలని కోరారు. ఆటో, క్యాబ్ వాహనాలపై 300 నుండి 30 వేల వరకు ఇ-చలానాలను విధించారని, దీనివల్ల డ్రైవర్లు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశామని, కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించామని, పాత బస్టాండ్ వద్ద రిలే నిరాహార దీక్షలు చేపట్టామని, ఏలూరు ఎంఎల్‌ఎ ఆళ్ల నానికి వినతిపత్రాలు అందజేశామని, అయినప్పటికీ సమస్య పరిష్కరించకపోవడం దారుణమని విమర్శించారు. డ్రైవర్లపై విధించిన చలానాలను తొలగించి వారి జీవనోపాధిని కాపాడాలని కోరారు. లేనిపక్షంలో భవిష్యత్ కార్యాచరణకు సిద్ధమవుతామని తెలిపారు.




ఎఎస్‌పికి వినతిపత్రం అందిస్తున్న నేతలు

మూఢ విశ్వాసాలను పోగొట్టేందుకు సైన్స్ దోహదం

జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకులు పాండురంగారావు

ప్రజాశక్తి - టి.నరసాపురం

సమాజంలో మూఢ విశ్వాసాలను పోగొట్టి శాస్త్రీయ ఆలోచనలు కల్పించేందుకు సైన్స్ దోహదపడుతుందని జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకులు పి.పాండురంగారావు అన్నారు. స్థానిక విజన్ యుపి స్కూల్‌లో కరస్పాండెంట్ పురం శ్రీనివాస్ ఆధ్వర్యంలో మండలంలోని బండివారిగూడెం యుపి పాఠశాలలో జాతీయ విజ్ఞానశాస్త్ర దినోత్సవ వేడుకలు, జన విజ్ఞాన వేదిక ఆవిర్భావ దినోత్సవ వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జన విజ్ఞాన వేదిక జెండాను పాఠశాల ఆవరణలో ఆవిష్కరించారు. ప్రముఖ భారతీయ భౌతిక శాస్త్రవేత్త, భారతరత్న, నోబెల్ బహుమతి గ్రహీత సర్‌సివి.రామన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జన విజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకులు పి.పాండురంగారావు మాట్లాడుతూ ప్రజల కోసం సైన్స్, ప్రగతి కోసం సైన్స్ అనే నినాదంతో పనిసేస్తున్న సైన్స్ ప్రచార సంస్థ జన విజ్ఞాన వేదిక అని చెప్పారు. సమాజంలోని మూఢ విశ్వాసాలను పోగొట్టి, శాస్త్రీయ ఆలోచనలు కల్పించటానికి జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మ్యాజిక్ షోలు, సైన్స్ ప్రతిభ పరీక్షలు, చైతన్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. మరో గౌరవ అతిథిగా విచ్చేసిన చింతలపూడి ప్రభుత్వ వైద్యశాల కౌన్సిలర్ ఎన్.అశోక్‌బాబు మాట్లాడుతూ భారతదేశపు ప్రముఖ శాస్త్రవేత్త సర్‌సివి.రామన్ రూపొందించిన రామన్ ఎఫెక్ట్‌ను కేంద్ర ప్రభుత్వం ఆమోదించిన ఈ రోజును జాతీయ సైన్స్ దినోత్సవంగా ప్రకటించిందన్నారు. విద్యార్థులు చిన్నతనం నుంచి విజ్ఞాన శాస్త్రం పట్ల ఆసక్తి కలిగి ఉండాలన్నారు. సమాజానికి మేలు చేసే వస్తువులను, విషయాలను కనుగొనేందుకు తమ జీవితాలను ధారపోసిన శాస్త్రవేత్తలను ప్రతి విద్యార్థి ఆదర్శంగా తీసుకోవాలన్నారు. విద్యార్థులందరూ నవసమాజం కోసం పాటుపడే భావిభారత శాస్త్రవేత్తలుగా ఎదగాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిత్యజీవితంలో ఉపయోగించే సైన్స్ ప్రయోగాలు, మట్టితో చేసిన పలురకాల నమూనాలను ప్రదర్శించారు. భారత విజ్ఞాన శాస్త్రంలో సివి.రామన్ పాత్ర అంశంపై నిర్వహించిన వక్తృత్వ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ టి.రామ్మూర్తి, హెచ్‌ఎం బాజా, ఉపాధ్యాయులు విజయలక్ష్మి, వరలక్ష్మి, అరుణ, మహాలక్ష్మి, పుష్పవతి, ఏస్తేరు రాణి, మధులత, రమ్యశ్రీ, మౌనిక, రాజేశ్వరి పాల్గొన్నారు.



సివి.రామన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న వక్తలు

పట్టిసీమ ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లూ చేయాలి

జాయింట్ కలెక్టర్ లావణ్యవేణి

ప్రజాశక్తి - పోలవరం

శివరాత్రి సందర్భంగా పట్టిసీమలో శ్రీ భద్రకాళి సమేత వీరేశ్వరస్వామి ఆలయానికి వచ్చే యాత్రికులకు ఎటువంటి ఇబ్బందీ లేకుండా పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని జాయింట్ కలెక్టర్ లావణ్యవేణి సూచించారు. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. పట్టిసీమలో మహాశివరాత్రి ఉత్సవాల ఏర్పాట్లపై ఆమె బుధవారం వివిధ శాఖాధికారులతో సమీక్ష నిర్వహించారు. జంగారెడ్డిగూడెం ఆర్‌డిఒ అద్దయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో తొలుత వివిధ శాఖల అధికారులు చేపట్టనున్న పనులను వివరించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ లావణ్యవేణి మాట్లాడుతూ మహాశివరాత్రి ఉత్సవాలు మార్చి 7, 8, 9 తేదీల్లో జరగనున్నాయని, సుమారు రెండు లక్షల మంది యాత్రికులు వచ్చే అవకాశం ఉందని అన్నారు. ఉత్సవాల నాటికి ఎండ తీవ్రత ఎక్కువగా ఉండే అవకాశం ఉన్నందున తాగునీరు పుష్కలంగా అందుబాటులో ఉంచాలన్నారు. చలువ పందిళ్లు ఏర్పాటు చేయాలన్నారు. గోదావరిలో స్పీడ్‌బోట్లను, గజ ఈతగాళ్లను, ఏర్పాటు చేయాలని, 104, 108 అంబులెన్స్ వాహనాలు 24 గంటలూ అందుబాటులో ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. గోదావరి దాటిన తర్వాత ఎక్కువ దూరం నడవాల్సి వస్తుందని, వృద్ధులు, వికలాంగులకు ఇబ్బంది లేకుండా డోలీలు వంటివి ఏర్పాటు చేసేందుకు పరిశీలించాలన్నారు. ఏర్పాట్లన్నీ పకడ్బందీగా చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం మహాశివరాత్రి ఉత్సవాల పోస్టర్లను విడుదల చేశారు. ఈ సమావేశంలో పోలవరం డిఎస్‌పి సురేష్‌కుమార్‌రెడ్డి, డిపిఒ తూతిక శ్రీనివాస్‌విశ్వనాథ్, ఎపీడీ డి.దామోదర్‌రావు, ఎంపిపి సుంకర వెంకటరెడ్డి, ఎంపిడిఒ జి.శ్రీను, తహశీల్దార్ ప్రసాద్, పంచాయతీ సర్పంచి సబ్బరపు శ్రీరామమూర్తి, ఎస్ఐ పవన్ కుమార్, ఆలయ కార్యనిర్వహణాధికారి సంగమేశ్వరశర్మ, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.



మహాశివరాత్రి వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న జాయింట్ కలెక్టర్ లావణ్యవేణి

తాగునీరందించాలని ధర్నా

పంచాయతీ సెక్రటరీ చొరవతో సమస్య పరిష్కారం

ప్రజాశక్తి - చింతలపూడి

20 రోజులుగా తాగునీరు లేకపోవడంతో ఎంతమందికి మొర పెట్టుకున్నా సమస్య పరిష్కారం లభించకపోవడంతో మండలం లోని ప్రగడవరం పంచాయతీ ప్రకాష్ నగర్ ప్రజలు రోడ్డుపై బుధవారం ధర్నా చేశారు. తాగునీరు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, చిన్నారులు అల్లాడిపోతున్నారని, తమ బాధను వివరించినా ఎవరూ పట్టించుకోవడంలేదన్నారు. దీంతో తాము రోడ్డెక్కి ధర్నా చేస్తున్నామని చెప్పారు. తాగునీటి సమస్య పరిష్కరించేవరకూ ధర్నా విరమించేది లేదని హెచ్చరించారు. విషయం తెలుసుకున్న ప్రగడవరం పంచాయతీ సెక్రటరీ మురళీప్రకాష్ సంఘటనా స్థలానికి చేరుకుని ప్రజలతో మాట్లాడారు. తాగునీటి సమస్య పరిష్కరించేందుకు చర్యలు తీసుకున్నారు. దీంతో ప్రకాష్ నగర్ వాసులు ధర్నా విరమించి సెక్రటరీ చొరవతో సమస్య పరిష్కారం కావడంతో హర్షం వ్యక్తం చేశారు.



రోడ్డుపై ధర్నా చేస్తున్న ప్రకాష్‌నగర్ వాసులు

1 నుంచి ఎంఎస్ ఎంఇ సర్వే

జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ ఆదిశేషు

ప్రజాశక్తి - ఏలూరు

చిన్న, మధ్య తరహా పరిశ్రమల పని తీరును మెరుగుపరిచి డేటా బేస్ అభివృద్ధి చేసేందుకు మార్చి ఒకటో తేదీ నుంచి 20వ వరకు సర్వే, సపోర్ట్ మొబైల్ యాప్‌తో జిల్లా వ్యాప్తంగా సర్వే నిర్వహించనున్నట్లు జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ ఆదిశేషు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. విజయవాడలోని ఎపి ఎంఎస్ ఎంఇ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సిఇఒ వారి ఆదేశాలతో చేపట్టిన ఈ సర్వే కోసం నియమించిన బృందానికి ఎంఎస్ ఎంఇ అసోషియేషన్లు, ఇతర పరిశ్రమల అసోషియేషన్లు వర్తక వాణిజ్య సంఘాలు సహకరించి సర్వేకు అవసరమైన వివరాలు అందించి సర్వేను విజయవంతం చేయాలని కోరారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, పట్టణ ప్రాంతాల్లో వార్డు అమెనిటీ సెక్రటరీలు ఈ సర్వే చేస్తారన్నారు. ఎంపిడిఒలు, మున్సిపల్ కమిషనర్లు, అదనపు డెవలప్‌మెంట్ కమీషనర్ల ద్వారా ఈ సర్వే పురోగతిని జిల్లా పరిశ్రమల కేంద్రం జిల్లా కలెక్టర్ వారి ఆధ్వర్యంలో పర్యవేక్షిస్తుందని తెలిపారు.

ఉచిత విద్యకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి - ముసునూరు

ప్రయివేట్ పాఠశాలల్లో ఉచిత విద్యకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు మండల విద్యాశాఖాధికారి బివి.సుబ్బారావు తెలిపారు. బుధవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ విద్యాహక్కు చట్టం కింద 2024-25 విద్యా సంవత్సరంలో ప్రయివేట్ పాఠశాలల్లో పేద పిల్లలకు ఉచిత అడ్మిషన్ల కోసం నేటి నుంచి మార్చి నెల 14వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రతికూల పరిస్థితుల్లో ఉన్న అనాథలు, హెచ్ఐవి బాధితులు, విభిన్న ప్రతిభావంతులు, ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనారిటీ, ఒసి సామాజిక తరగతుల పిల్లలకు ఈ పథకం వర్తిస్తుందన్నారు. రాష్ట్రంలోని ప్రయివేట్, అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో వీరికి 25 శాతం సీట్లు కేటాయిస్తున్నట్లు తెలిపారు. ఒకటో తరగతి నుంచి ప్రవేశానికి నేటి నుంచి మార్చి 14వ తేదీ వరకు అర్హత గల విద్యార్థుల ఆధార్ వివరాలతో http:-cse.ap.gov.in సైట్‌లో అప్లై చేసుకోవాలని తెలిపారు.



మాట్లాడుతున్న చైర్‌పర్సన్ నాగలక్ష్మి

మామిడి రైతులకు పలు సూచనలు

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

మండలంలోని యనమదల, బత్తులవారిగూడెం, సుంకొల్లు గ్రామాల్లో మామిడి తోటలను ఉద్యాన అధికారి ఆర్.హేమ సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె రైతులతో మాట్లాడుతూ తామర, కొక్కెం పురుగుల ఉధృతి అధికంగా ఉందని తెలిపారు. తామర పురుగుల నివారణకు తోటల్లో జిగురు అట్టలను పసుపు, నీలం రంగు అట్టలను ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. తామర పురుగుల ఉధృతి అధికంగా ఉంటే స్పైనో సాడ్ 0.25 మిల్లీలీటర్లు లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలని రైతులకు సూచించారు. పొంగా మియా సోప్ 7.5 గ్రాములు లీటర్ నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలని తెలిపారు. కొక్కెం పురుగుల (దారం పురుగులు) నివారణకు క్లోరోపైరీఫాస్ 1 మిల్లీలీటర్ లీటర్ నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతులు, ఆర్‌బికె సిబ్బంది పాల్గొన్నారు.

628 మందికి రైతు భరోసా లబ్ధి

ప్రజాశక్తి - భీమడోలు

భీమడోలు మండలానికి ప్రస్తుత రైతు భరోసా పథకం కింద రూ.12.56 లక్షలు మంజూరయ్యాయని, 628 మంది కౌలు రైతులకు లబ్ధి చేకూరనుందని వ్యవసాయ అధికారి ఉషారాణి తెలిపారు. సున్నా వడ్డీ కింద 2021-22 రబీ సాగులో 436 మందికి రూ.8.11లక్షలు, 2022 -23 ఖరీఫ్ సాగు కింద 447 మంది రైతులకు రూ.8.23 లక్షలు మంజూరయ్యాయని తెలిపారు. మండలంలో ఈ పంట నమోదు కార్యక్రమం పూర్తయిందన్నారు. 13,159 ఎకరాల్లో పంట నమోదు కాగా, దీనిలో 220 ఎకరాల మొక్కజొన్న సాగవుతుందని, మిగిలినది వరి సాగుగా గుర్తించామని తెలిపారు.

జంగారెడ్డిగూడెంలో 'జగనన్న ఆరోగ్య సురక్ష'

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం టౌన్

జంగారెడ్డిగూడెం తొమ్మిదో సచివాలయం పరిధిలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జంగారెడ్డిగూడెం మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన నాగలక్ష్మి మాట్లాడుతూ రాష్ట్రంలో పేదలు ఆరోగ్యం బాగుండాలని ఆలోచించి 2004లో కీర్తిశేషులు వైఎస్.రాజశేఖర్‌రెడ్డి ఆరోగ్యశ్రీ పథకాన్ని ప్రవేశపెట్టారన్నారు. ఈ ఆరోగ్య శ్రీ పథకాన్ని 2014 నుంచి 2019 వరకు చంద్రబాబు నాయుడు, పట్టించుకోలేదన్నారు. మళ్లీ 2019 ఎన్నికల్లో సిఎం జగన్ ఆరోగ్యశ్రీలో మెరుగైన వైద్యం అందించేందుకు చర్యలు తీసుకున్నారన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా వైద్య పరీక్షలు చేస్తూ పేదలకు మెరుగైన వైద్యం అందిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ ముప్పిడి వీరాంజనేయులు, పట్టణ అధ్యక్షులు చిటికెల అచ్యుతరామయ్య, కౌన్సిలర్ ఉగ్గం దుర్గాప్రసాద్, నేకూరి కిషోర్, దొంతు మాధవ్, ప్రభుత్వ హాస్పటల్ డైరెక్టర్ భావన రుషి, వైసిపి నాయకులు గోడపాటి రాధాకృష్ణ పాల్గొన్నారు.

'దళితులను దగా చేసిన వైసిపి'

ప్రజాశక్తి - చింతలపూడి

దళితులను వైసిపి ప్రభుత్వం దగా చేసిందని మాల మహాసేన జాతీయ అధ్యక్షుడు అలగ రవికుమార్ అన్నారు. మండలంలోని ప్రగడవరం గ్రామపంచాయతీలో చింతలపూడి స్వతంత్ర ఎంఎల్ఎ అభ్యర్థి సరిపల్లి పెద్దిరాజుతో గ్రామాల్లో బుధవారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం 27 దళితుల సంక్షేమ పథకాలను రద్దు చేసిందన్నారు. బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ అంబేద్కర్ విదేశీ విద్యను తీసేసిందన్నారు. పాత కారు ఉంటే రేషన్ కార్డు రద్దు చేసిందన్నారు. పెళ్ళికానుకలు పథకాన్ని దళిత గిరిజనులకు దూరం చేసే ఉద్దేశంతో పదో తరగతి నిబంధన పెట్టిందన్నారు. అంబేద్కర్ స్టడీ సర్కిల్స్ కులాంతర వివాహాల ప్రోత్సాహకాలు రద్దు చేసిందన్నారు. వైసిపి నాయకులు ప్రజలు ప్రశ్నించాలన్నారు. మరోసారి దళితులను మోసం చేయడానికి వైసిపి ప్రయత్నిస్తుందన్నారు. చింతలపూడి స్వతంత్ర ఎంఎల్ఎ అభ్యర్థి సరిపల్లి పెద్దిరాజును ఆదరించాలని కోరారు. అనంతరం పెద్దిరాజు మాట్లాడుతూ ఇప్పటివరకు చింతలపూడి నియోజకవర్గంలో పలు సమస్యలపై పోరాటం చేశానన్నారు. తాను పేదల పక్షపాతి అని చెప్పారు. ఈ కార్యక్రమంలో మాల మహాసేన సైనికులు మండలాధ్యక్షులు బంటు వెంకటేశ్వరరావు, మాల మహాసేన జాతీయ యువజన కార్యదర్శి గోలే విజయ్, ఏలూరు జిల్లా కార్యదర్శి కమ్మిలి నాని, ఏలూరు జిల్లా యూత్ సెక్రటరీ ఆనందరాజు, ప్రముఖ అంబేద్కర్ వాది రవీంద్ర పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

పేకాట స్థావరంపై దాడి

ప్రజాశక్తి - టి.నరసాపురం

పేకాట స్థావరంపై దాడి చేసిన పోలీసులు ఏడుగురిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి నగదు స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ జయకుమార్ తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని వల్లంపట్ల గ్రామ శివారులోని ఖాళీ ప్రదేశంలో పేకాట ఆడుతున్నారన్న సమాచారం మేరకు ఎస్ఐ జయకుమార్ తన సిబ్బందితో బుధవారం దాడి చేశారు. ఈ దాడిలో ఏడుగురిని అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.52,500 నగదు స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ తెలిపారు.

నాటుసారా విక్రయిస్తున్న ఒకరు అరెస్టు

ప్రజాశక్తి - టి.నరసాపురం

నాటుసారా విక్రయిస్తున్న మహిళను పోలీసులు అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని మధ్యాహ్నపువారిగూడెం గ్రామానికి చెందిన మహిళ నాటుసారా విక్రయిస్తున్నారన్న సమాచారం మేరకు ఎస్ఐ టి.నరసాపురం ఎస్ఐ తన సిబ్బందితో బుధవారం దాడి చేశారు. ఈ దాడిలో ఆమెను అరెస్టు చేసి ఆమె వద్ద నుంచి ఐదు లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ తెలిపారు.

అన్నవరం రోడ్డులో మందుబాబుల చిందులు

మహిళలపై వికృత చేష్టలు
పాఠశాల ఆవరణలో మద్యం సీసాలు, గ్లాసులు
పోలీసులు చర్యలు తీసుకోవాలని వేడుకోలు

ప్రజాశక్తి - ముదినేపల్లి

ముదినేపల్లిలోని అన్నవరం రోడ్డు మందుబాబులకు ఆవాసాలుగా మారింది. ఈ రోడ్డులో నిత్యం మందుబాబులు మద్యం తాగి చిందులేస్తున్నారు. రాత్రి ఏడు గంటల నుంచి మందుబాబులు ఈ రోడ్డులో చేరి మద్యం తాగుతూ హడావిడి చేస్తున్నారు. స్కూలు పక్కన ఉన్న సీసీ రోడ్డులో మందు బాబులు గుంపులు గుంపులుగా చేరి మద్యం తాగుతున్నారు. మందు బాబుల చేష్టలతో ఈ రోడ్డుపై వెళ్లే వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో ఈ రోడ్డులో వెళ్లే మహిళలు మందుబాబుల వికృత చేష్టలతో భయభ్రాంతులకు గురవుతున్నారు. ఈ రోడ్డులో ఒంటరిగా వెళ్లే మహిళల పట్ల మందుబాబులు అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నట్లు మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ రోడ్డుకు కూతవేటు దూరంలో మద్యం దుకాణం ఉంది. దీంతో మందుబాబులు మద్యం కొనుగోలు చేసి ఈ రోడ్డులో తిష్ట వేసి మద్యం తాగుతూ రోడ్డున పోయే మహిళల పట్ల వికృత చేష్టలు చేస్తున్నారు. దీంతో మహిళలు భయందోళనకు గురవుతున్నారు. దీంతో చీకటి పడితే ఈ రోడ్డులో మహిళలు ఒంటరిగా వెళ్లేందుకు జంకుతున్నారు. ఫూటుగా మద్యం తాగిన మందుబాబులు ఈ రోడ్డులో నానా యాగి చేస్తున్నారు. ఈ రోడ్డులో ఉన్న స్కూలు ఆవరణలో మందుబాబులు మద్యం ఖాళీ సీసాలను, గ్లాసులు పడేస్తున్నారు. దీంతో స్కూల్ యాజమాన్యం మందు బాబులు తాగి పడేసిన ఖాళీ మద్యం సీసాలను, గ్లాసులను తొలగించి స్కూల్ ఆవరణను శుభ్రం చేసుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. ఇప్పటికైనా పోలీసులు స్పందించి ఈ రోడ్డులో మందుబాబుల ఆగడాలకు చెక్ పెట్టాలని మహిళలు కోరుతున్నారు.

విద్యార్థుల్లో ప్రతిభను వెలికితీయాలి

సైన్స్ దినోత్సవంలో ఎంఇఒ శ్రీనివాసరావు

ప్రజాశక్తి - భీమడోలు

విద్యార్థుల్లో దాగి ఉన్న విజ్ఞాన ప్రతిభను వెలికితీసేందుకు జాతీయ సైన్స్ దినోత్సవం కార్యక్రమం దోహదపడుతుందని భీమడోలు విద్యాధికారి శ్రీనివాసరావు అన్నారు. జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని భీమడోలు శ్రీ చైతన్య పాఠశాల ప్రిన్సిపల్ డి.సోహిని ఆధ్వర్యంలో విద్యార్థులు తమ గైడ్ టీచర్ల ఆధ్వర్యంలో తయారుచేసిన పలు ఆవిష్కరణలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఎగ్జిబిషన్‌లో ఆవిష్కరణల ఆశయాలు, లక్ష్యాలను వివరించారు. కార్యక్రమానికి భీమడోలు విద్యాధికారి ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థులు తయారు చేసిన ఆవిష్కరణను తిలకించారు. దీనిలో భాగంగా విద్యార్థులు తయారుచేసిన మిక్స్ ఫార్మింగ్, చంద్రయాన్-3, గుండె-రక్త ప్రసరణ, కిడ్నీల పనితీరు, సోలార్ వ్యవస్థ ఆధారంగా ట్రాఫిక్ నియంత్రణ, రక్త గ్రూపు నిర్ధారణ పరీక్ష, ఇతర అంశాలను ప్రదర్శించారు. వీటిలో ఉత్తమమైన ప్రదర్శనగా ఎనిమిదో తరగతి విద్యార్థులు జి.రిత్విక్, జి.ప్రేమనాగసాయి తయారుచేసిన చంద్రయాన్-3 ఎంపికైంది. న్యాయ నిర్ణేతలుగా భీమడోలు శ్రీ వెంకటేశ్వర డిగ్రీ, జూనియర్ కళాశాలకు చెందిన సైన్స్ విభాగం అధ్యాపకులు మమత, ఎన్.సుబ్బారావు వ్యవహరించారు. వీరు చంద్రయాన్‌తో పాటు మరొక రెండు అంశాలను ద్వితీయ, తృతీయ ప్రదర్శనలుగా నిర్ధారణ చేశారు. విజేతలకు బహుమతి ప్రదానం ప్రముఖుల చేతులమీదుగా చేశారు. ఈ కార్యక్రమంలో చైతన్య పాఠశాలకు చెందిన ముఖేష్ కుమార్‌తో పాటు పలువురు ఇతర సబ్జెక్ట్ అధ్యాపకులు పాల్గొన్నారు.


అన్నేవారిగూడెం ఉన్నత పాఠశాలలో..

అన్నేవారిగూడెం మండల పరిషత్ ప్రాథమిక ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు షేక్ మస్తాన్ ఆధ్వర్యంలో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు సైన్స్ దినోత్సవ ప్రాముఖ్యత గురించి వివరించారు. జిల్లా స్థాయిలో నిర్వహించిన ఇన్‌స్పైర్ అవార్డు పోటీల్లో విజేతగా నిలిచిన పాఠశాల విద్యార్థి దాసరి చైతన్యకృష్ణకుమార్ ను పాఠశాల యాజమాన్యం తరపున అభినందించి సత్కరించారు. విద్యార్థులు తయారుచేసిన పలు ఆవిష్కరణలు, విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి ప్రధానోపాధ్యాయులు తగు రీతిలో సత్కరించారు.

ఏలూరు టౌన్ : దెందులూరులో బిఆర్‌డి స్కూల్ ఆఫ్ నర్సింగ్ విద్యార్థులు జాతీయ సైన్స్ దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ విజ్ఞాన శాస్త్రవేత్తల పరిశోధన ప్రతిభను అంతర్జాతీయ స్థాయిలో ఇనుమడింప చేసిన వారిలో రామన్ అగ్రగణ్యుడని చెప్పారు. ఆవిష్కరణలో నోబెల్ బహుమతి రావటం గర్వకారణమన్నారు. నోబెల్ గ్రహీత రామన్ పరిశోధనల కోసం భారతీయులు విదేశాలకు వెళ్లటం ఏంటని, విదేశీయులే భారతదేశానికి రావాలని చాటి చెప్పిన వ్యక్తి సర్‌సివి.రామన్ అని కొనియాడారు. ప్రతి ఏడాది ఒక థీమ్‌తో సైన్స్ దినోత్సవాన్ని నిర్వహిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మండవల్లి : సైన్స్‌తోనే సమాజం అభివృద్ధి సాధ్యపడుతుందని శాస్త్రవేత్త సుధామ ఫౌండేషన్ అధినేత సుధాబత్తుల విజయ్‌కుమార్ అన్నారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం నిర్వహించిన సైన్స్ డే కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై సివి.రామన్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా విజయ్‌కుమార్ మాట్లాడుతూ వాస్తవ విషయాలను చెప్పేది సైన్స్ అని అన్నారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా శాస్త్ర సాంకేతిక రంగాల్లో వస్తున్న మార్పులకు అనుగుణంగా విద్యార్థుల్లో పోటీ తత్వం పెరగాలన్నారు. నేటి విద్యార్థులు సైన్స్‌పై ఆసక్తిని పెంచుకుని సృజనాత్మకతతో యువ శాస్త్రవేత్తలుగా ఎదగాలన్నారు. అనంతరం సర్ సివి.రామన్, అబ్దుల్‌కలాం, ఎంఎస్ విశ్వనాథన్, మోక్షగుండం విశ్వేశ్వరయ్య, అలెగ్జాండర్ ఫ్లెమింగ్ శాస్త్రవేత్తల ఆవిష్కరణలను విద్యార్థులకు వివరించారు. స్థానిక గ్రంథాలయంలో సైన్స్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సైన్స్ ఎగ్జిబిషన్‌లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులను అందించారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ బ్యాంక్ మేనేజర్ బొంతు దుర్గారావు, ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక సభ్యులు భాస్కరరావు, మండలాధ్యక్షులు టి.అప్పారావు, గ్రంథాలయ నిర్వాహకురాలు షేక్ పరిమిన, సైన్స్ ఉపాధ్యాయులు జ్యోత్స్న, దుర్గమ్మ, శ్రీదేవి, కాత్యాయని పాల్గొన్నారు.

చింతలపూడి : పాఠశాల దశ నుంచి విద్యార్థులు కష్టపడి చదివితే భవిష్యత్తులో మంచి ఫలితాలు వస్తాయని సర్వశిక్ష అభియాన్ ఎపిసి సోమశేఖర్ అన్నారు. చింతలపూడి పట్టణంలోని సుబ్బరాజు హైస్కూలులో బుధవారం నిర్వహించిన జాతీయ సైన్స్ దినోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు సైన్స్ పట్ల ఆసక్తి చూపించాలని, ప్రయోగాలకు ఎప్పటికప్పుడు సిద్ధంగా ఉండాలని చెప్పారు. నూతన విషయాలు తెలుసుకోవడానికి వాటిపై ప్రయోగాలు చేయడానికి విద్యార్థులు ఆసక్తి కనబరచాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ రామారావు పాల్గొన్నారు.



భీమడోలు: చంద్రయాన్-3 నమూనాతో విద్యార్థులు

ఎన్నికలకు క్షేత్రస్థాయిలో వైసిపి కేడర్ సిద్ధం

ఎంఎల్ఎ ఆళ్లనాని

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

జగన్మోహన్‌రెడ్డి పాలన రాష్ట్రానికి చారిత్రాత్మక అవసరమని, ఈ ఘట్టంలో ప్రతి ఒక్క కార్యకర్త ప్రత్యేక చొరవ చూపాలని, భావి తరాలకు ఒక గొప్ప సంక్షేమ పాలనను కొనసాగించడంలో భాగమయ్యామని గర్వంగా చెప్పుకోగలమని వైసిపి కేడర్‌కు ఏలూరు ఎంఎల్ఎ ఆళ్ల నాని దిశానిర్దేశం చేశారు. ఏలూరులోని 40వ డివిజన్‌లో స్థానిక కార్పొరేటర్ తుమరాడ స్రవంతి ఆధ్వర్యంలో సీనియర్ కార్యకర్త రౌతు వెంకటేశ్వరరావు గృహంలో బుధవారం నిర్వహించిన వైసిపి కుటుంబాలతో ఆళ్ల నాని ఆత్మీయ సమావేశం కార్యక్రమంలో ఎంఎల్ఎ ఆళ్ల నాని ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పార్టీ కోసం కృషి చేస్తున్న 40వ డివిజన్‌లోని పలువురు నాయకులు, కార్యకర్తలతో ఆళ్ల నాని ముఖాముఖిగా సమావేశమయ్యారు. రానున్న ఎన్నికల్లో అవలంభించాల్సిన విధివిధానాలపై ఆళ్లనాని దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ ఆళ్ల నాని మాట్లాడుతూ పార్టీ కోసం నిస్వార్ధంగా సేవలందించే కార్యకర్తల సంక్షేమం కోసం పార్టీ ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందన్నారు. రాష్ట్రంలో గాడి తప్పిన పాలనను అదుపు చేస్తూ 2019లో వైసిపి ప్రభుత్వం అధికారంలోకొచ్చిన తర్వాత డిబిటి విధానం ద్వారా సంక్షేమ పాలనను ఎటువంటి దళారీ వ్యవస్థ లేకుండా ప్రజలకు అందించినట్లు చెప్పారు. సచివాలయ వ్యవస్థ ఏర్పాటుతో ప్రభుత్వ సేవలను ప్రజల ముంగిటకు తీసుకొచ్చారన్నారు. గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యాన్ని స్థాపించిన దేశంలోనే ఏకైక ముఖ్యమంత్రి జగన్ అని, అటువంటి నాయకుడి పాలన కొనసాగించడంలో ప్రతి వైసిపి కార్యకర్త భాగస్వామ్యం అవ్వాలన్నారు. ఈ సందర్భంగా స్థానిక కార్యకర్తలు మాట్లాడుతూ ఒకప్పుడు వరద వస్తే ఈ ప్రాంత ప్రజలంతా 12 పంపుల స్కూల్‌లోకి వెళ్లి ప్రాణభయంతో బిక్కు బిక్కు మంటూ ఆశ్రయం పొందేవారని, ఎంఎల్ఎ నాని చేసిన తమ్మిలేరు రిటైనింగ్ వాల్ పనుల వల్ల ప్రశాంతంగా బతుకుతున్నామన్నారు. రోడ్లు, డ్రెయిన్లు కూడా ఎన్నో అభివృద్ధి చేశారని, రానున్న ఎన్నికల్లో అన్ని విధాలా ఆళ్ల నానికి అండగా ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్లు శ్రీనివాస్, నూకపెయ్యి సుధీర్‌బాబు, ఏలూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఛైర్మన్ బొద్దాని శ్రీనివాస్, కో-ఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్ పెదబాబు, క్లస్టర్-3 అధ్యక్షులు, మాజీ మార్కెట్ యార్డ్ ఛైర్మన్ మంచెం మైబాబు, మార్కెట్ యార్డ్ డైరెక్టర్లు సాసుపల్లి యుగంధర్, కోరాడ బాబు, వైసిపి నాయకులు సామంతుల లక్ష్మణరావు, కంది రంగబాబు, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సీనియర్ టైలర్స్‌ను సన్మానిస్తున్న టైలర్స్ వెల్ఫేర్ అసోసియేషన్‌వారు

ఘనంగా టైలర్స్ డే

ప్రజాశక్తి - కలిదిండి

కుట్టు మిషన్ సృష్టి కర్త విలియమ్స్ హెూవే జయంతి సందర్భంగా నిర్వహిస్తున్న టైలర్స్ డేను కలిదిండిలో బుధవారం ఘనంగా నిర్వహించారు. మండలంలోని టైలర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్వర్యంలో ప్రధాన సెంటర్ నుంచి బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. విలయమ్స్ హువే చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీనియర్ టైలర్స్ షబ్బీర్ ఖాన్, మూసా మాస్టర్‌ను ఘనంగా సన్మానించారు. సర్పంచి మసిముక్కు మారుతీప్రసన్న వెంకటేశ్వరరావు, ఎంపిటిసి సభ్యులు నీలి సుమన్, చాన్ బాషా, టైలర్స్ సంఘం అధ్యక్షుడు ఎండి నూరుద్దిన్, కార్యదర్శి ఇనయ్ తుల్లా, ఉపాధ్యక్షులు పి.వెంకటేశ్వరరావు, కోశాధికారి అబ్దుల్ నయీం, అమ్మాజీ, మౌలా, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

వైసిపి విజయానికి కలిసికట్టుగా కృషి చేయాలి

ఎంపీ కోటగిరి శ్రీధర్

ప్రజాశక్తి - చింతలపూడి

రానున్న ఎన్నికల్లో వైసిపిని విజయం సాధించేందుకు అందరూ కలిసికట్టుగా కృషి చేయాలని ఏలూరు ఎంపి కోటగిరి శ్రీధర్ అన్నారు. పట్టణంలో వైసిపి నూతన కార్యాలయాన్ని ఆయన బుధవారం ప్రారంభించారు. అనంతరం పలుచోట్ల పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలు దగ్గరికి వస్తున్నాయని, వైసిపి అభ్యర్థులను గెలిపించి జగన్మోహన్‌రెడ్డికి బహుమతిగా ఇవ్వాలని కోరారు. అనంతరం వైసిపి చింతలపూడి నియోజకవర్గ ఇన్‌ఛార్జి విజయరాజు మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో గెలిచి చింతలపూడి నియోజకవర్గాన్ని సిఎం జగన్‌కు కానుకగా ఇస్తానని తెలిపారు. అందరూ కలిసికట్టుగా వైసిపి విజయం కోసం పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి ఛైర్మన్ జానకిరెడ్డి, ఎంపిపి రాంబాబు, జెడ్‌పిటిసి సభ్యులు మోలుగుమాటి నీరజ సుధాకర్, మిర్యాల దిలీప్ వెంపకృష్ణ, సిటీ మెడికల్ దుర్గారావు పాల్గొన్నారు.

చినవెంకన్న సేవలో రాష్ట్ర మంత్రులు

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల

ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకాతిరుమల వెంకటేశ్వరస్వామి ఆలయాన్ని డిప్యూటీ సిఎం, రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ, రాష్ట్ర హోం శాఖ మంత్రి తానేటి వనితలు బుధవారం ఉదయం సందర్శించారు. ఆలయానికి విచ్చేసిన వారికి ముందుగా దేవస్థానం అధికారులు, అర్చకులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వారు స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. అనంతరం ఆలయ ముఖ మండపంలో అర్చకులు, పండితులు వారికి శ్రీవారి శేషవస్త్రాలను కప్పి, వేద ఆశీర్వచనాన్ని పలికారు. ఆలయ ఇఒ వేంద్ర త్రినాధరావు చినవెంకన్న జ్ఞాపికలను, ప్రసాదాలను అందించారు. ద్వారకాతిరుమల వెంకటేశ్వర స్వామి వారి దేవాలయంలో శ్రీ ధర్మా అప్పరాయ సదనంపై రెండో అంతస్తు నిర్మాణానికి శంకుస్థాపన, సహస్ర దీపాలంకరణ సేవ, మండపం ప్రారంభం పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్త ఎస్‌వి.నివృతరావు, ట్రస్టు బోర్డు సభ్యులు, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.



చిత్రపటాలు అందిస్తున్న ఆలయ అధికారులు

'రానున్న ఎన్నికల్లో టిడిపి, జనసేనదే విజయం'

ప్రజాశక్తి - చింతలపూడి

రానున్న ఎన్నికల్లో టిడిపి, జనసేన కూటమి విజయం సాధిస్తుందని టిడిపి చింతలపూడి అభ్యర్థి సొంగా రోషన్‌కుమార్ అన్నారు. పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలో జరుగుతున్న టిడిపి, జనసేన మహాసభకు సొంగా రోషన్‌కుమార్ ఆధ్వర్యంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు వేలాదిగా బయలుదేరి తరలివెళ్లారు.

టి.నరసాపురం : పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలో టిడిపి, జనసేన ఉమ్మడిగా నిర్వహించిన బహిరంగ సభకు జనసేన మండల కన్వీనర్ అడపా నాగరాజు ఆధ్వర్యంలో బుధవారం జనసైనికులు కార్లపై తరలివెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జనసేన, టిడిపి ఉమ్మడి పోటీలో విజయం ఖాయమని, జనసేనకు రోజు రోజుకు ప్రజల మద్దతు పెరుగుతోందని చెప్పారు.

వైసిపికి ఉమామహేశ్వరరావు రాజీనామా

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

ఏలూరు 30వ డివిజన్ కార్పొరేటర్ ఉమామహేశ్వరావు వైసిపికి రాజీనామా చేశారు. ఈ మేరకు పార్టీ నగర అధ్యక్షులు బి.శ్రీనివాస్‌కి రాజీనామా పంపించారు. తన వ్యక్తిగత కారణాలతోనే వైసిపికి రాజీనామా చేస్తున్నట్లు తెలిపారు. తన రాజీనామాను ఆమోదించాలని కోరారు.